ఇవండీ సంగోతులు !

- ఛిద్రమైన రమణయ్యపేట–జె.అన్నవరం ప్రధాన రహదారి
- అడుగడుగునా గోతులతో ప్రమాదాలు
- అవస్థలు పడుతున్న వాహనదారులు


రమణయ్యపేట సమీపంలో గోతులతో అధ్వానంగా ఉన్న ప్రధానరహదారి


వర్షపు నీటితో చెరువును తలపిస్తున్న రమణయ్యపేట–జె.అన్నవరం రోడ్డు

ఏలేశ్వరం: ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లే ఆర్ అండ్ బీ ప్రధానరహదారి గోతులతో అధ్వానంగా మారింది. ఈ రహదారి మీదుగా రోజుకు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఏలేశ్వరం మండలం రమణయ్యపేట గ్రామం నుంచి అడ్డతీగల మండలం గొంటువానిపాలెం మీదుగా జె.అన్నవరం వరకూ సుమారు పది కిలోమీటర్ల మేర రహదారి పూర్తిగా ఛిద్రమైంది. ఏజెన్సీ ముఖద్వారమైన ఏలేశ్వరం నుంచి అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం, గంగవరం మండలాలతో పాటు అనకాపల్లి జిల్లా నర్సీపట్నం వెళ్లేందుకు నిత్యం ఈ రహదారిపై వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రమణయ్యపేట నుంచి తూర్పులక్ష్మీపురం వరకూ రహదారి గోతులమయంగా మారడంతో ఈ మార్గంలో వెళ్లేందుకు వాహనదారులు నరకయాతన పడుతున్నారు.

వర్షాలకు మరింత ధ్వంసం

ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిపై నీరు నిలిచిపోయి అడుగడుగున గోతులు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్రవాహనదారుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఏజెన్సీ ప్రాంతాల నుంచి మైదాన ప్రాంతాలకు వచ్చేందుకు ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారు. గోతుల్లో నీరు చేరి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

భారీవాహనాల రాకపోకలతో...

జె.అన్నవరం గ్రామంలోని ఏఎంకే క్రషర్ కోసం సమీపంలోని క్వారీల నుంచి నల్లరాయిని భారీ వాహనాల ద్వారా తరలిస్తున్నారు. క్రషర్ కోసం ప్రతిరోజూ నిబంధనలకు విరుద్ధంగా అతి భారీ వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రహదారి పూర్తిగా ధ్వసమైంది. దీంతో పాటు క్రషర్ నుంచి వచ్చే బూడిద రహదారిపై రాకపోకలు సాగించే వాహనదారులు కళ్లలో పడుతోంది. దీంతో కంటి సంబంధిత సమస్యలు వస్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు ఇక్కట్లు



రహదారి అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం కారణంగా రహదారి దారుణంగా తయారైంది. రాత్రి సమయాల్లో ఈ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

– యిజనగిరి శివప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు, తూర్పులక్ష్మీపురం

రహదారి నిర్మాణ పనులు ప్రారంభిస్తాం

రమణయ్యపేట–జె.అన్నవరం రహదారి నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తాం. గతంలో కాంట్రాక్టర్ రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. సత్వరమే రహదారి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– ఎస్ గణేష్, ఆర్అండ్‌బీ డీఈ, పెద్దాపురం

క్లుప్తంగా

విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీ

గండేపల్లి: మండలంలోని సింగరంపాలెం, మురారి, నీలాద్రిరావుపేట, తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు బ్యాగ్, యూనిఫాం, బూట్లతో కూడిన కిట్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోర్పు లచ్చయ్యదొర, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్, కోర్పు సాయితేజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

గోకవరం: విద్యార్థి దశ నుంచే మహిళా, బాలల చట్టాలపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెనుగొండ ఇందిరారాణి సూచించారు. గోకవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం ఆడపిల్లలను చదివిద్దాం–ఆడపిల్లలను రక్షిద్దాం అనే నినాదంతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు, అక్రమ రవాణా, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గండేపల్లి: జాతీయ రహదారిపై మండలంలోని తాళ్లూరు వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. రోడ్డు సేఫ్టీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... ఎన్టీ రాజాపురానికి చెందిన తాళ్లూరి సూరిబాబు, మణికాంతం మోటార్ సైకిల్‌పై జగ్గంపేట వైపు వస్తున్నారు. మండలంలోని తాళ్లూరు శివారు దాబాలకు ఎదురుగా డివైడర్ వద్ద మలుపు తిరుగుతుండగా వెనుక నుంచి మోటార్ సైకిల్‌పై వస్తున్న జగ్గంపేటకు చెందిన రెడ్డి రఘురాం వారిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రఘురాం, మణికాంతాలకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


ప్రమాణ స్వీకారం చేసిన విద్యార్థులతో విజయ్‌ప్రకాష్

తుని: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్ ప్రకాష్ సూచించారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థలో సోమవారం స్కూల్, హౌస్ కెప్టెన్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వం వహించడమంటే బాధ్యత తీసుకోవడమే అన్నారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాకారం చేసుకునేందుకు అహర్నిశలు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్ ద్వారా గౌరవవందనం స్వీకరించిన విజయ్‌ప్రకాష్ నాయకులుగా ఎంపికైన వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


కాకరాపల్లిలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై శంకర్

కోటనందూరు: మండలంలోని కాకరాపల్లిలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. డ్రంగ్ అండ్ డ్రైవ్‌లో దొరికిన వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై శంకర్ మాట్లాడుతూ వాహనదారులు విధిగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురంలో ప్రజలకు సోమవారం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. స్వచ్ఛతా వారోత్సవాల్లో భాగంగా అరబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో పంచాయతీ, ఐసీడీఎస్, అంగన్‌వాడీలు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, ఆశా వర్కర్లతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ప్రధాన వీధుల్లో పర్యటించి ప్రజలకు శుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలు నాటారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధి డి.సుధాకర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో తాచుపాము కలకలం


అచ్యుతాపురంలో స్నేక్ క్యాచర్ బంధించిన గోధుమ తాచు

గోకవరం: తాచుపాము పగబడుతుందని కొందరు అంటే.. అది ఒట్టి నమ్మకమేనని, అందుకు శాస్త్రీయ నిరూపణేదీ లేదని మరికొందరు అంటారు. కానీ, గోకవరం మండలం అచ్యుతాపురంలో చోటు చేసుకున్న సంఘటన చూస్తే పగ పట్టిందేమోననే అనిపిస్తోందని అంటున్నారు స్థానికులు. గ్రామానికి చెందిన దడాల కన్నయ్య సోమవారం గ్రామ శివారున ఉన్న పొలంలోకి పుట్టగొడుగుల కోసం వెళ్లాడు. అక్కడ ఓ పుట్ట వద్ద తాచుపాము బుసలు కొట్టడంతో కన్నయ్య భయపడి ఇంటికి వచ్చేశాడు. ఈ విషయాన్ని స్థానికులకు చెప్పడంతో తాచుపాము, పగబడుతుందని మంత్రించిన బియ్యం ఇంటి ఆవరణలో చల్లితే పాము రాదని, భయం ఉండదని అన్నారు. దీంతో కన్నయ్య మంత్రించిన బియ్యం తీసుకుని ఇంటికి వచ్చేసరికి అతని పెంకుటింటి పైకప్పుపై ఓ పాము తిష్ట వేసుకుని కనిపించింది. కన్నయ్య పేరు పిలిచిన వెంటనే అది బయటకు వచ్చి బుసలు కొట్టిందని స్థానికులు అంటున్నారు. దీంతో భయాందోళనలకు గురైన వారు వెంటనే రాజమహేంద్రవరానికి చెందిన స్నేక్ క్యాచర్ మాధవ్‌కు సమాచారం ఇచ్చారు. అతడు వచ్చి, ఇంటి పైకప్పులో ఉన్న తాచుపామును చాకచక్యంగా పట్టుకుని సంచిలో బంధించాడు. ఇది గోధుమ తాచు అని, దీనిని సమీప అటవీ ప్రాంతంలో విడిచిపెడతానని చెప్పాడు. అయితే, కన్నయ్య పొలంలో చూసిన పాము.. అతడి ఇంటి పైకప్పుపై ఉన్న పాము ఒకటేనా అనే దానిపై ఎవ్వరూ ఎటువంటి స్పష్టతా ఇవ్వలేదు.

బకాయిల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


డ్వామా పీడీ, ఇతర అధికారులతో సమీక్షిస్తున్న యనమల రామకృష్ణుడు

తుని రూరల్: వ్యవసాయ పరపతి సంఘాల్లో పేరుకుపోయిన మొండి బకాయిల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు డీసీసీబీ అధికారులను హెచ్చరించారు. తుని మండలం తేటగుంటలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన డ్వామా, డీఆర్‌డీఏ, ఉద్యాన, విద్యా, డీసీసీబీ, తదితర శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. తుని, తొండంగి, కోటనందూరు సొసైటీల ఆర్థిక వ్యవహారాలపై సమీక్షించారు. కోటనందూరు సొసైటీలో రూ.2.5 కోట్లు, తుని సొసైటీలో రూ.కోటి 95 లక్షలు, తొండంగి సొసైటీలో ఉన్న రూ.కోటి బకాయిలను వసూలు చేయాలన్నారు. పేదలకు ఉపాధి కల్పన, గ్రామాభివృద్ధి లక్ష్యంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేయాలని సూచించారు. నియోజకవర్గానికి రెండు విడతలుగా ప్రతిపాదించిన రూ.15 కోట్ల విలువైన ఉపాధి పనులను మంజూరు చేయాలని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మికి సూచించారు. కార్యక్రమంలో నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చింతంనీడి అబ్బాయి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఏలేశ్వరంలో 20 ఏళ్ల తరువాత కలిసిన పూర్వవిద్యార్థులు

ఏలేశ్వరం: హాయ్ బాగున్నావా.. గతంలో మనం చదువుకొనే రోజుల్లో నువ్వు చాలా అల్లరి చేసేవాడివి గుర్తుందా.. ఆనాటి రోజులే బాగుండేవి.. ఇప్పుడా ఆప్యాయతలు సన్నగిల్లుతున్నాయి.. సెల్‌ఫోనే ప్రపంచంగా మారిపోయింది అంటూ పూర్వవిద్యార్థులు ఒకరినొకరు పలకరించుకున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 2003–05 బ్యాచ్ ఇంటర్ ఆర్ట్స్ గ్రూపు విద్యార్థులు సోమవారం పట్టణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 20 ఏళ్ల తరువాత తాము చదువుకున్న కళాశాలలో కలుసుకుని గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. సుమారు 70 మంది పూర్వవిద్యార్థులు కలుకుసుని తమ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తాము చదువుకున్న రోజులను గుర్తుకు చేసుకున్నారు. ఆటపాటలతో సందడిగా గడిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చారుమజుందార్ వర్ధంతి

ప్రత్తిపాడు: స్థానిక సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యాలయంలో సోమవారం నక్సల్ బరీ ఉద్యమ నేత చారు మజుందార్ 52వ వర్ధంతిని నిర్వహించారు. తొలుత లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం చారు మజుందార్ చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎందరికో ఉద్యమ స్ఫూర్తిని కలిగించిన చారు మజుందార్ అడుగు జాడల్లో యువత నడవాలని పిలుపునిచ్చారు. లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు, రాష్ట్ర ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం, అఖిల భారత ప్రగతిశీలా మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాల రత్నం, లిబరేషన్ అనుబంధ సంఘాల నాయకులు సుంకర రాజు, గొల్లపల్లి కామరాజు, అనసూరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తునిలో ఘన నివాళులు

తుని: సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చారుమజుందార్ వర్ధంతిని స్థానిక గొల్లప్పారావు సెంటర్లో సోమవారం నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) ప్రతినిధులు చారుమజుందార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కమిటీ సభ్యుడు జనార్ధన్, పలువురు లిబరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చారుమజుందార్‌కు నివాళులు

జగ్గంపేట: మండలంలోని గోవిందపురంలో సోమవారం చారుమజుందార్ వర్ధంతి నిర్వహించారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యుడు జక్కంపూడి రాజు ఆధ్వర్యంలో చారుమంజుదార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు లిబరేషన్ నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఘనంగా వీడ్కోలు


బదిలీ అయిన తహసీల్దార్ హేమకుమారిని సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

గోకవరం: స్థానిక తహసీల్దార్ బి.హేమకుమారి బదిలీ కావడంతో సోమవారం ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్ హేమకుమారిని శాలువా, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అంబటి రజని, ఇతర రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రజని

గోకవరం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ అంబటి రజని నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆమెకు ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. సోమవారం ఆమె ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు.

జూనియర్ కళాశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


జగ్గంపేట జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే మాట్లాడుతూ జగ్గంపేటలో యూనివర్సిటీ స్థాయి విద్యాలయం నెలకొల్పాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధ్యాపకులు ఎమ్మెల్యే నెహ్రూను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పలువురు నేతలు పాల్గొన్నారు.

అడ్డుకొండ భూమిని పేదలకు పంచాలి


జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతు కూలీ సంఘం నేతలు

జగ్గంపేట: గండేపల్లి, జగ్గంపేట మండలాల సరిహద్దులో ఉన్న సుమారు 500 ఎకరాల అడ్డుకొండ భూమిని పేదలకు పంచాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజినేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ పాషాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వీరాంజినేయులు మాట్లాడుతూ కె.గోపాలపురం, మల్లిసాల గ్రామాల మధ్య ఉన్న 500 ఎకరాల భూమిని పేదలకు పంచాలని కొన్నేళ్లుగా ఉద్యమాలు చేస్తూ, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తున్నా ఇప్పటివరకూ తమకు న్యాయం జరగలేదన్నారు. ఈ భూమిని ఆక్రమించుకున్న భూస్వాములు కోర్టుకు వెళ్లగా కోర్టు ఈ భూమిని ప్రభుత్వ పోరంబోకుగా డిక్లేర్ చేసిందని వివరించారు. కూటమి ప్రభుత్వం వెంటనే ఈ భూమిని పేదలకు పంపిణీ చేసి, పట్టాలు ఇవ్వాలని కోరారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కడితి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ నిందితులకు జరిమానా

గండేపల్లి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన నిందితులకు పెద్దాపురం కోర్టు జరిమానా (ఫైన్) విధించినట్టు గండేపల్లి ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపారు. గత నాలుగు రోజులుగా నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఐదుగురు వ్యక్తులను పోలీసులు సోమవారం పెద్దాపురం కోర్టులో హాజరుపరిచారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.హర్షవర్ధన్ ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున ఫైన్ విధించినట్టు ఎస్సై తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జరిమానా

తుని: మద్యం సేవించి వాహనాలు డ్రైవింగ్ చేసిన ముగ్గురిని తుని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి జరిమానా విధించారని పట్టణ సీఐ.గీతా రామకృష్ణ సోమవారం తెలిపారు. ఒకొక్కరికి రూ.10 వేలు ఫైన్ వేశారన్నారు. వాహన చోదకులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్న ఉద్దేశంతో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

గోకవరం: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, మద్యపానం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గోకవరం ఎస్సై కె.నాగరాజు సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బహిరంగ ప్రదేశంలో ఎవరైనా ధూమపానం, మద్యపానం చేస్తే వారిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తామన్నారు. ధూమపానం, మద్యపానం అలవాటు ఉన్న వారు ఇది గమనించాలని సూచించారు.

పచ్చిరొట్ట సాగుతో బహుళ ప్రయోజనాలు


గవరపేటలో దమ్ములో కలియదున్నుతున్న జనుము

తుని రూరల్: పచ్చిరొట్టను ఖరీఫ్ దమ్ముల్లో కలియదున్నడం వలన బహుళ ప్రయోజనాలు కలుగుతాయని మండల వ్యవసాయ అధికారి బి.అశోక్‌కుమార్ అన్నాను. మండలంలోని తేటగుంట శివారు గవరపేటలో సోమవారం ఆయన పర్యటించారు. రైతు మద్దాల శ్రీను పొలంలో పచ్చిరొట్టను దమ్ములో కలియదున్నే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ అశోక్ కుమార్ మాట్లాడుతూ రెండు నెలల కిందట జీలుగు, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు రాయితీపై అందించామన్నారు. అప్పుడు ఇచ్చిన విత్తనాలు రైతులు జల్లడంతో ఇప్పుడు దమ్ములో కలియ దున్నుకునేందుకు వీలుకలుగుతుందన్నారు. పచ్చిరొట్ట 50 శాతం పుష్పించిన తర్వాత దమ్ములో కలియదున్నాలని సూచించారు. దున్నిన తరువాత పది నుంచి 20 రోజుల కుళ్లనిస్తే సూక్ష్మ జీవులు వృద్ధి చెంది భూసారం పెరుగుతుందన్నారు. ఇలా చేస్తే నేలకు సేంద్రియ ఎరువు వేసినట్టే అన్నారు. జీవ రసాయన చర్యలు కలిగి పంటలకు అవసరమైన పోషకాలు అందుతాయన్నారు. భూమిలో గుల్ల ఏర్పడి పైర్ల మొదళ్లకు సాగునీరు సమృద్ధిగా చేరుతుందన్నారు. నేల సారవంతంతో కావడంతో సాగులో అధిక దిగుబడులు వస్తాయన్నారు. రైతులు తప్పనిసరిగా ఖరీఫ్ దమ్ములో పచ్చిరొట్టను కలియదున్నాలని సూచించారు. వీఏఏ పి.భావని, రైతు మద్దాల శ్రీను పాల్గొన్నారు.

వేములపాలెంలో అగ్ని ప్రమాదం

రూ.3 లక్షల ఆస్తి నష్టం


వేములపాలెం అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన పశువుల పాక, జోడెడ్ల బండి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని వేములపాలెంలో సోమవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన అన్నదమ్ములు దిడ్డి రాజబాబు, దిడ్డి చినవెంకటరమణ, దిడ్డి రామత్రినాథ్‌లకు చెందిన పశువుల పాకకు గుర్తు తెలియన వ్యక్తులు నిప్పు పెట్టారు. ఈ ప్రమాదంలో పశువుల పాక, 35 బస్తాల ధాన్యం, నాటు ఎడ్లబండి, గడ్డివామి, వ్యవసాయ సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న ప్రత్తిపాడు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఆయిల్ పామ్ సాగుతో రైతులకు మేలు


శంఖవరంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటుతున్న ఉద్యానశాఖాధికారి అరుణ్‌కుమార్

శంఖవరం: ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఉద్యానశాఖాధికారి పి.అరుణ్‌కుమార్ అన్నారు. శంఖవరంలో రైతులకు సోమవారం ఉచితంగా ఆయిల్ పామ్ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు వంద శాతం రాయితీపై హెక్టార్‌కు రూ.27 వేలు విలువైన 143 మొక్కలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. ఆయిల్ పామ్‌లో అంతర పంటల సాగుకు ఏడాదికి రూ.5250 సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఉద్యానశాఖ సహాయకులు పి.శ్యామ్‌సుందర్, సీత, రాజు, బిందు తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయంతో విద్యార్థులకు భోజనాలు


తుని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు భోజనాలు అందిస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

తుని/రౌతులపూడి/ప్రత్తిపాడు రూరల్/గోకవరం: శిక్షా సప్తాహ్ కార్యక్రమం ముగింపు వేడుకల్లో భాగంగా తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం శుభ్ దిన్ భోజన్ కార్యక్రమం నిర్వహించారు. దాతలు, ప్రజాప్రతినిధుల సహకారంలో విద్యార్థులకు భోజనాలు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. తుని సీతారాంపురం అల్లసాని పెద్దన్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం రోటరీక్లబ్ తునిశాఖ ఆధ్వర్యంలో 100 మందికి భోజనాలు అందించారు. రోటరీక్లబ్ ద్వారా విద్యార్థులకు పుస్తకాలు, సదుపాయాలు కల్పిస్తున్నామని క్లబ్ అధ్యక్షుడు మంగరాజు తెలిపారు. రౌతులపూడి మండలంలోని ఎం.కొత్తూరు శివారు ధారపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎంపీపీ జి.రాజ్యలక్ష్మి భోజనాల పంపిణీని ప్రారంభించారు. ఎంఈఓలు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలు పంపిణీ చేశారు. ప్రత్తిపాడు మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బీజేపీ నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. గోకవరం మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు స్థానిక నాయకులు భోజనాలు పంపిణీ చేశారు.

వసతి గృహం తనిఖీ


వసతి గృహంలో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్న న్యాయమూర్తి భాను

ప్రత్తిపాడు: స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కాటం భాను సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహం పరిసరాలు, రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారో లేదో ఆరా తీశారు. కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకుని, ఉన్నత ప్రమాణాలు సాధించాలని విద్యార్థులకు న్యాయమూర్తి భాను సూచించారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి ఎంఎస్ సత్యనారాయణ, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.